

# పందెం

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

సమయం రాత్రి ఏడున్నర.

ఆ రాత్రి సుప్రియ బార్‌లో అట్టే రద్దీ లేదు. నెలాఖరు అందుకు కారణం. ఆ బార్‌లోకి వచ్చాడతను. కేవలం అయిదడుగులే వుండడంతో ఎంతో పొట్టిగా కనిపిస్తున్నాడు. రెండు చేతులకి ఆరు వేళ్ళు. నున్నటి గడ్డం. గోల్డ్ ఫ్రేం కళ్ళద్దాలు. ఆ మనిషిని ఓసారి చూస్తే జీవితాంతం గుర్తుంచుకునే రూపం.

వచ్చి బార్ స్టూల్ మీద కూర్చుని చెప్పాడు.

"ఓ పెగ్ పాతయోగి."

"పాత యోగా? అంటే?" అడిగాడు బార్‌టెండర్.

"ఓల్డ్‌మాంక్ రమ్" నవ్వాడతను.

కేవలం ఐసుముక్కలే వేసుకుని ఆ పెగ్‌ని కొద్దిగా చప్పరించి చెప్పాడతను.

"నా పేరు వరదారావు. అంతా పందేల వరదారావు అంటారు."

"పందేల మీ ఇంటి పేరా?" అడిగాడు బార్‌టెండర్.

"ఊహు. పందెం కడుతుంటాను కాబట్టి ఆ పేరొచ్చింది."

"ఏం పందేలు? గుర్రపు పందాలా?"

"కాదు. ఉట్టినే. అసాధ్యం అయిన వాటి మీద పందాలు కట్టి గెలుస్తుంటాను. ఒకోసారి ఓడిపోతుంటాను. అది నా వీక్‌నెస్. కావాలంటే నీతో కూడా పందెం కడతాను."

"ఏం పందెం?" అడిగాడు బార్‌టెండర్ నవ్వి. రమ్ పూర్తిగా తాగి అతను కొద్ది క్షణాలు ఆలోచించి చెప్పాడు.

"ఈ పెగ్ రమ్ ప్లస్ పాతిక రూపాయిలు పందెం."

"అసలు పందెమేమిటి?" అడిగాడు బార్‌టెండరు.

"నా పళ్ళతో నా కుడిచెవిని కొరుకుతానని పందెం."

"నీ పళ్ళతో నీ కుడి చెవి కొరకడమా? అసాధ్యం" చెప్పాడు బార్‌టెండరు వెంటనే.

"సాధ్యం. పందేనికి ఒప్పుకున్నట్లేనా?" అడిగాడు పందేల వరదారావు.

"ఒప్పుకున్నాను" చెప్పాడు బార్‌టెండర్.

వెంటనే వరదారావు నోట్లోంచి తన కట్టుడు పళ్ళు తీసి వాటిని చేత్తో పట్టుకుని తన కుడిచెవిని వాటితో కొరికేలా చేశాడు. బార్‌టెండర్ ఆశ్చర్యంగా చూస్తుంటే వాటిని మళ్ళీ నోట్లో పెట్టుకుని చిన్నగా నవ్వి చెప్పాడు.

"గెలిచాను. ఇంకో పెగ్, పాతిక ఇవ్వు."

బార్‌టెండర్ తన జేబులోంచి పాతిక రూపాయిలు తీసి వరదారావు కిచ్చి చెప్పాడు.

"తెలివయిన వాడివే"

ఆ పెగ్‌లో కూడా ఐస్ క్యూబ్స్ వేసుకుని కొద్దిగా తాగి వరదారావు అడిగాడు.

"నాతో ఇంకో పందెం కడతావా?"

"అదేమిటో చెప్పు"

"ఈసారి నా కుడికంటిని నా పళ్ళతో కొరుకుతాను. అయితే పళ్ళు బయటకి తీయను. ఇందాకటిలా పాతిక ప్లస్ పెగ్."

"ఓ.కే. పందెం" చెప్పాడు బార్‌టెండర్ వెంటనే పందెం పాతిక రాబట్టుకోవచ్చని.

పందేల వరదారావు తన కుడిగాజు కన్నుని తీసి నోట్లో వుంచుకుని, తన పళ్ళతో సుతారంగా కొరికి మళ్ళీ దాన్ని యథాస్థానంలో వుంచాడు. అది నోరు తెరచుకుని చూస్తూండిపోయిన బార్‌టెండర్ తేరుకుని చెప్పాడు.

"నువు మేధావివి"

"పాతిక ప్లస్ ఇంకో పెగ్ ఇవ్వు" చెప్పాడు వరదారావు చిన్నగా నవ్వి.

పాతిక తీసుకున్నాక వరదారావు చెప్పాడు మళ్ళీ.

"సరే మళ్ళీ అదే పందెం" చెప్పాడు బార్‌టెండర్.

తన పెగ్‌ని ఖాళీచేసిచ్చాడు వరదారావు. బార్‌టెండర్ దాన్ని విశాలమైన హాల్లో ఓ మూల వుంచాడు. దాని కెదురు మూలలో నిలబడి వరదారావు కాండ్రించి వుమ్మేసాడు. అది గ్లాసులో పడలేదు. అలా నాలుగైదుసార్లు ప్రయత్నించినా లాభం లేకపోయింది.

"ఓడిపోయావు. పాతిక ఇవ్వు. రెండు పెగ్‌లకి డబ్బు కట్టు" చెప్పాడు బార్‌టెండర్ ఆనందంగా

"నేను ఈ బార్‌లో ఓ మూల నించుంటాను. నువు మరోమూల ఈ ఖాళీ గ్లాసుని వుంచు. సరిగ్గా ఆ గ్లాసులో పడేలా గట్టిగా వుమ్మేతాను. మళ్ళీ అదే పందెం."

ఈసారి బార్‌టెండర్ కొద్దిసేపు ఆలోచించాడు. బార్‌లో ఓ మూల నించి ఇంకోమూలకి వున్న దూరం అరవై అడుగులు. ఎంత మేధావి అయినా అది సాధ్యం కాని పని.

చిరునవ్వుతో.

పందేల వరదారావు చిన్నగా నవ్వాడు.

"ఓడిపోలేదు. ఆ టేబిల్ దగ్గర కూర్చున్నతనితో వందకి పందెం కాసాను, నీ బార్‌లో కార్పెట్ మీద నీ ఎదురుగానే వుమ్మేతానని, అలా వుమ్మినా నువు చూసి చిరాకు పడకుండా ఆనందంగా నవ్వుతావని" చెప్పాడు నెమ్మదిగా. ●





ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 6-4-90